
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

మంగళవారం 30 జూలై 2024 | 5

ధవళేశ్వరం వద్ద తగ్గుతున్న వరద



7లో



ముమ్మిడివరం: లంకాఫ్ గేదెల్లంకలో వరదనీటిలో బెండ తోట



ముమ్మిడివరం: గురజాపులంకలో పడవ ప్రయాణం



కపిలేశ్వరపురం: నారాయణలంక కాజ్‌వేపై వరదనీరు

గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న గోదావరి వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఫలితంగా కోనసీమలోని నదీపాయలను ఆనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వరద ముప్పు తగ్గినా ఇంకా వేలాది కుటుంబాలకు చెందిన ప్రజలు ముంపుతో ఇబ్బందులు పడుతున్నారు. రవాణా సౌకర్యం, విద్యుత్ సరఫరా లేక, తాగేందుకు మంచినీరు కొరతతో పాటు అనేక సమస్యలతో లంక గ్రామాల్లో ప్రజలు బతుకు జీవుడా అని కాలం గడుపుతున్నారు.



పి.గన్నవరం మండలంలో ఎన్డీఆర్ఎఫ్



మామిడికుదురు మండలం పాశర్లపూడి శ్రీరాంపేటలో పడవ ప్రయాణం



పి.గన్నవరం: కె.ఏనుగుపల్లిలో వరదనీటిలో హెల్త్ క్లినిక్



పి.గన్నవరం: మానేపల్లి శివారు పల్లిపాలెంలో



లంకాఫ్ రాణేలంకలో తెప్పపై చిన్నారులు

శాంతించిన నది

● క్రమంగా తగ్గుతున్న వరద.. ● ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాల ప్రజలు ● అయినా ఇంకా ముంపులోనే ఇళ్లు, పొలాలు

అమలాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): సుమారు పది రోజులుగా కోనసీమను వరద చుట్టుముట్టింది. గౌతమీ, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయలను ఆనుకుని ఉన్న పన్నెండు మండలాల పరిధిలోని 35కు పైగా లంక గ్రామాలు వరద తాకిడికి గురయ్యాయి. రాత్రివేళల్లో విషపూరితమైన పాములతో పాటు ఇతర కీటకాల సంచారం వల్ల కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నామంటూ లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదులు ఉధృతంగా ప్రవహించడం వల్ల లంకల్లోకి నిత్యావసర సరుకులు, పాలు వంటి సరుకులు అందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరదల వల్ల గంటి పెదపూడి వద్ద ఓ వ్యక్తి గల్లంతైన నేపథ్యంలో అధికారులు పడవల రాకపోకలను పూర్తిగా కంట్రోల్ చేస్తున్నారు. దీనివల్ల ఇష్టానుసారంగా పడవలు రాకపోకలు సాగించడానికి అవకాశం లేకపోవడంతో లంక గ్రామాల్లో నిత్యం సంచరించే ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో కోనసీమలో మాత్రం నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. మరికొన్ని రోజుల్లో అమావాస్య ఉండడంతో ఈ లోగా వరద తగ్గుముఖం పడితే మంచిదని లేకుంటే అమావాస్య పోటుకు తన్నిపెట్టి మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందని లంక గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కలెక్టర్ మహేష్‌కుమార్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులకు సూచనలిస్తున్నారు. ఇప్పటికే వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో బియ్యం, పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు వంటి నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేస్తున్నారు.



నాగుల్లంక శివారు పల్లిపాలెంలో నీట మునిగిన ఇళ్లు

ముంపులో 21,492 కుటుంబాలు..

గోదావరి వరద ప్రభావంతో జిల్లాలోని 21,492 కుటుంబాలు ముంపు బారిన పడ్డాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల నిమిత్తం 75 బోట్‌లను వినియోగిస్తున్నామన్నారు. ముంపు బాధితుల సంరక్షణ కోసం జాతీయ విపత్తు స్పందన బృందం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందన్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు, ముమ్మిడివరం మండలం రాణేల్లంక గ్రామాల్లోని పునరావాస కేంద్రాలు ముంపు బాధితుల కోసం నిర్వహిస్తున్నామన్నారు. 293 కుటుంబాలకు చెందిన 809 మంది సభ్యులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. వారికోసం 8,600 ఆహార ప్యాకెట్లను సరఫరా చేశామన్నారు. 2,300 వాటరు ప్యాకెట్లు, 13,736 వాటర్ క్యాన్లు సరఫరా చేశామన్నారు. వరద ముంపుతో ఒక కచ్చా గృహం పూర్తిగా దెబ్బతినగా ఏడు గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. మరో ఐదు గుడిసెలు దెబ్బతిన్నట్టు గుర్తించామన్నారు. లంక గ్రామాల్లో 60 వైద్య శిబిరాలు నిర్వహించి ముంపు బాధితుల ఆరోగ్య భద్రతా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలను 16,182 కుటుంబాలకు గాను ఇప్పటికే 15,592 కుటుంబాలకు అందించామన్నారు. ఇళ్లలోకి వరదనీరు చేరిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటించిన రూ.3 వేల ఆర్థికసాయాన్ని అందించేందుకు 327 కుటుంబాలను గుర్తించామన్నారు. వీరు పునరావాస కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ చెప్పారు.

పడవలపైనే రాకపోకలు

పి.గన్నవరం, జూలై 29: గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం వద్ద కూడా వరద తగ్గింది. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 14 లక్షల క్యూసెక్కులు మాత్రమే వదులుతున్నారు. దీంతో వశిష్ట, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయల్లో వరద ఉధృతి తగ్గినప్పటికి ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే లంకలు మొత్తం జలమయమయ్యాయి. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు లంక గ్రామాలతో పాటు కె.ఏనుగుపల్లి, శివాయిలంక, చినకందాలపాలెం వాసులు ఇప్పటికీ పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే కె.ఏనుగుపల్లి, గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున కాజ్‌వేలతో పాటు, కనకాయలంక కాజ్‌లపై వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. లంకలగన్నవరం శివారు జొన్నల్లంక, మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం, నాగుల్లంక శివారు పల్లిపాలెం, గుడ్డాయిలంక, కందాలపాలెం తదితర గ్రామాల్లోకి వరదనీరు రోడ్లపైకి చేరి పలు ఇళ్ల చుట్టూ ప్రవేశించింది. లంకల్లో వాణిజ్య పంటలతో పాటు కూరగాయల పంటలు పూర్తిగా మునిగిపోయాయి.



పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెంలో నీట మునిగిన అరటి



కె.ఏనుగుపల్లిలో వరద నీటిలో కొబ్బరికి రక్షణ



వరద నీటిలో మత్స్యకార కాలనీ

వరద నీటిలోనే ఇళ్లు..పొలాలు

ముమ్మిడివరం, జూలై 29: గోదావరి ఎగువన వరద నీటి ప్రవాహ ఉధృతి తగ్గుతున్నా దిగువన ఉన్న ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాల్లో వరద ప్రవాహం మాత్రం ఇంకా కొనసాగుతోంది. ఆదివారం కన్నా సోమవారం వరద నీటి మట్టం మరో మూడు అడుగుల మేర పెరిగింది. సోమవారం రాత్రి నుంచి వరద ప్రవాహం ఉధృతి కొంత తగ్గవచ్చునని అధికారులు భావిస్తున్నారు. వివేకానంద వారధి, గురజాపులంక సిమెంట్ రోడ్డు కూనాలంక పాఠశాల నుంచి గురజాపులంక తుఫాన్ షెల్టర్ వరకు వరద నీట మునిగింది. లంకాఫ్ ఠాణేలంకలో మత్స్యకార కాలనీ రోడ్డు నీట మునిగింది. గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంకల్లో అంతర్గత రోడ్లు నీట మునిగాయి. దీంతో అక్కడి ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిపాలెం, సలాదివారిపాలెం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటిలో మునిగి ఉన్నాయి. వరద ప్రభావిత లంక గ్రామాల్లో సుమారు 10 ఇళ్ల వరకు నీట మునిగినట్టు అధికారులు గుర్తించారు. వరద సహాయక ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, వీఆర్వోలు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. లంక గ్రామాలకు టిన్నుల ద్వారా రక్షిత మంచినీటిని అందిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

రైతుల ఆశలపై నీళ్లు..

చేతికొచ్చే సమయానికి పంట నీట మునక



వరద ముంపులో ఉన్న అరటి



వరద ముంపునకు గురై కుళ్లిపోతున్న బొప్పాయి తోట

కొత్తపేట, జూలై 29: లంకల్లో వాణిజ్య పంటలు, కూర పాదులు విరగబడి కాశాయని ఆనందిస్తున్న రైతులను అకాల వరద ముంచింది. వారి ఆశలపై బురదజల్లింది. ఎప్పుడూ ఆగస్టు చివరివారంలో అలా వచ్చి ఇలా వెళ్లిపోయే వరద ఈ సారి జూలైలోనే రావడంతో పాటు వందలాది ఎకరాలను ముంచేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎప్పుడూ లేని విధంగా మునగ, బొప్పాయి, అరటి పంటలు విరగబడి పండటంతో ఈ సారి అధిక దిగుబడులు సాధించి గట్టెక్కుదామనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అదే స్థాయిలో కూర పంటలైన వంగ, బీర, పచ్చిమిర్చి, కూరపాదులు పండాయని ఒక్క ఇరవై రోజులు ఆగితే పంట చేతికి వచ్చేదని ఈ అకాల వరద అప్పుల ఊబిలోకి నెట్టిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కూర పంటలైన వంగ, ఆనబ, పొట్ల, బీరకాయ వంటివి ముంపునీరుతో కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి గోదారమ్మ రైతుల కంట కన్నీరు కార్పించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



నిండా మునిగాయి

రూ.3.92 కోట్ల సార్వా పెట్టుబడిపై నీళ్లు

ముంపులో 2,180 ఎకరాల్లో నాట్లు

కుళ్లిపోయే దశలో 370 ఎకరాల్లో నారు

రంగరాజు ఉగ్రరూపంతో చెరువులుగా పొలాలు

అయోమయంలో అన్నదాతలు

ఉప్పలగుప్తం, జూలై 29: గతంలో కన్నా ఈ ఏడాది సార్వా సాగుపై రైతులు ఎక్కువగా మక్కువ చూపారు. సార్వా వల్ల ఎంతో కొంత లాభం ఉంటుందని ఆశించారు. అయితే ప్రకృతి ఆగ్రహించింది. డ్రెయిన్లు కన్నెర్రజేశాయి. సార్వా ముంపుబారిన పడింది. రైతులు నిండా మునిగారు. గత ఏడాది సార్వా సాగుకు ముందుకురాని రైతులు ఈ సారి ఆసక్తి కనబరిచారు. మండలంలో 5,664 ఎకరాల విస్తీర్ణంలో సాగుకు సన్నద్ధమయ్యారు. జూలై 5వ తేదీ నాటికి 2,180 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఇంతలో ముంపు ముంచుకొచ్చింది. ఎగువున వర్షాలు అధికం కావడంతో డ్రెయిన్ల ద్వారా నీరు ఉరకలెత్తింది. ప్రధానంగా అయిదు మండలాల పరిధిలోని మురుగునీరు దిగే రంగరాజుకోడు మీడియం డ్రెయిన్‌లో నీటి ప్రవాహ ఉధృతి పెరగడంతో ఉప్పలగుప్తం మండలంలోని డ్రెయిన్ ఆయకట్టు పొలాలు చెరువుల్లా మారాయి. నీటి ప్రవాహ ఉధృతికి తూరలు అమర్చిన ప్రాంతాల్లో రంగరాజుకోడు గట్లు తెగిపోయే స్థితికి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గొరగనమూడి, ఓల్డ్అయినాపురం డ్రెయిన్ల ద్వారా భారీ స్థాయిలో ముంపునీరు ప్రవహించడంతో సంబంధిత డ్రెయిన్ల ఆయకట్టు పొలాలు ముంపు బారిన పడ్డాయి. రంగరాజుకోడు డ్రెయిన్‌కు శివారులో ఉండటంతో మండలంలోని పొలాలపై ముంపు ప్రభావం పూర్తిగా పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన 2,180 ఎకరాల పొలాలు ప్రస్తుతం జలాశయాలను తలపిస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 370 ఎకరాలు కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి. 236 ఎకరాలు వరినారు ముంపులో ఉంది. పది రోజులుగా ముంపులో ఉన్న సార్వా నాట్లు, వరినారు దాదాపు ధ్వంసమయినట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాట్లు వేసిన పొలాలకు వ్యయం ఎకరాకు రూ.10 వేలు కాగా, నాట్లకు సిద్ధం చేసిన పొలాలకు ఎకరాకు రూ.5 వేలు ఖర్చయినట్టు రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన నాట్లు పడిన పొలాల్లో పెట్టిన ఖర్చు రూ.2.18 కోట్లు, నాట్లకు సిద్ధం చేసిన పొలాలకు పెట్టిన ఖర్చు రూ.1.74 కోట్లు నీటి పాలైనట్టేనని రైతులు వాపోతున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లేకపోతే ఉప్పలగుప్తం మండలంలో సార్వాకు స్వస్తి చెప్పడమే ఉత్తమమని రంగరాజుకోడులో పూడిక తీశారన్న ఆనందంతో ఈ ఏడాది సార్వా సాగుకు ముందుకొచ్చామని నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు నల్లా సత్యనారాయణమూర్తి చెప్పారు. శివారున ఉన్న కారణంగా ఎక్కడ వానొచ్చినా, ఏ మండలంలో వరద ముంపు ఏర్పడినా ఉప్పలగుప్తం మండలంలోని పొలాలు ముంపు బారిన పడుతున్నాయని, ముంపు సమస్య నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన కోరారు.

బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తాం..

బోటు ప్రమాదంలో గల్లంతైన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 29: ఉడిమూడిలంక పడవ బోల్తా ప్రమాద ఘటనలో వరద ప్రవాహంలో గల్లంతైన యువకుడు చదలవాడ విజయకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ భరోసా ఇచ్చారు. ఉడిమూడి శివారు పెదపేటలో విజయకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాద ఘటనను కొంత మంది రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారి కల్లబొల్లి మాటలు నమ్మవద్దన్నారు. ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇస్తున్నట్టు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెండు బోట్లలో 24 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారని ఇప్పటి వరకు ఏవిధమైన ఫలితం లేదని చెప్పారు. వరద ముంపు ప్రాంతాలలో ఉన్న నదీపాయలు, కాజ్‌వేలపై రాకపోకలు సాగించే సమయంలో పడవపై ఉన్న ప్రతి వ్యక్తికి లైఫ్‌జాకెట్లు ఉండాలని లేని వారిని పడవ దాటించొద్దని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సూరయ్యకాపు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, నక్కా సునీల్‌రాజు, రాజు తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే




ఉడిమూడిలంకలో యువకుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ఉడిమూడిలంక పడవ ప్రమాదంపై విభిన్న వాదనలు

పి.గన్నవరం, జూలై 29: ఉడిమూడిలంక పడవ ప్రమాద ఘటనపై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిర్లక్ష్యం కారణంగానే యువకుడు గల్లంతయ్యాడనే చర్చ జరుగుతోంది. అలాగే ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సమయంలో సహాయం అందలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పడవలో ప్రయాణించే వ్యక్తులు లైఫ్‌జాకెట్లతో ఉండగా ప్రమాదం జరిగితే కొంతమేర నీటిలో కొట్టుకుపోతారు తప్ప ప్రాణాలతో బయటపడలేరని పలువురి వాదన. ఇటువంటి భీకరమైన నదీపాయల్లో ప్రతి నాటు పడవకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తప్పనిసరిగా ఉంటే ప్రమాదం జరిగితే లైఫ్‌జాకెట్లతో ఉన్న వారిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడే అవకాశం ఉంటుందని కానీ అలా జరగకపోవడంతో యువకుడు గల్లంతయ్యాడని అంటున్నారు. అలాగే పడవ సామర్థ్యాన్ని లెక్కచెయ్యకుండా సుమారు 200 వాటర్ బస్తాలను వేయడం, నదీపాయలో రోజూ వెళ్లే మార్గంలో కాకుండా కొత్త మార్గంలో పడవ డ్రైవర్ తీసుకువెళ్లడం కూడా ముప్పు తీసుకువచ్చింది. ఈ ఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యం కనిపించిందని స్వయంగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రకటించారు. లైఫ్ జాకెట్టు ఉడిపోవడం వల్లనే యువకుడు గల్లంతయ్యాడని అధికారులు ప్రకటించారు. వరద ఉధృతి పదిరోజులుగా కొనసాగుతున్నప్పటికీ ఎన్డీఆర్ఎఫ్ బృందాలు జాడ కనిపించలేదు. ప్రమాదం జరిగిన గంటన్నర వ్యవధిలో అత్యవసరంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి సీతానగరం మండలంలో ములకల్లంక, బొబ్బిలంక నదీపాయ వద్ద పడవలపై రాకపోకలు సమయంలో ఇరువైపులా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇక్కడ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం కావడం లేదని స్థానికులు చెబుతున్నారు.

సెప్టెంబరు 14న లోక్ అదాలత్: జడ్జి నరేష్

అమలాపురం టౌన్, జూలై 29: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఛైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు బ్యాంకు, చెక్ బౌన్స్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. సెప్టెంబరు 14న ఉదయం 10.30 గంటల నుంచి జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని కేసులు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.



అమలాపురం రూరల్, జూలై 29: నల్లమిల్లి గ్రామ దేవత సత్తెమ్మతల్లిని గోకరకొండ వంశీయుల ఆధ్వర్యంలో సోమవారం శాకంబరిగా అలంకరించారు. గోకరకొండ గంగన్నస్వామినాయుడు, సర్పంచ్ గోకరకొండ వాసు, గోకరకొండ వంశీయులు తొలుత అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఆడపడుచులు పూజలు నిర్వహించారు.



ఇసుకపూడిలో కుటుంబంతో..

నరకయాతన అనుభవించి **ప్రాణాలతో బయటపడ్డా..**

స్వగ్రామానికి చేరుకున్న గల్ఫ్ బాధితుడు సరెళ్ల వీరేంద్రకుమార్

- మెయిన్





అనంతలక్ష్మి అమ్మవారికి వజ్ర కిరీటం

వచ్చేనెల 6న సమర్పణ

అన్నవరం, జూలై 29:

కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం సత్యదేవుడు వజ్రకిరీటధారియై భక్తులకు దర్శనమిస్తున్నారు. దేవేరి అనంతలక్ష్మి అమ్మవారి అలంకరణకు వజ్ర కిరీటం, స్వామి, అమ్మవార్లు ఇద్దరికీ వజ్ర కర్ణాభరణాలను లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ తయారు చేయించారు. కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలతో రూ.2కోట్లతో వీటిని తీర్చిదిద్దినట్టు అధికారులు తెలిపారు. వాటిని స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 6న దాత సమర్పిస్తారని దేవస్థానం అధికారులు వెల్లడించారు. సత్యదేవుడి ధ్వజస్తంభం బంగారు పూత కార్యక్రమాన్ని కూడా అదే రోజు ఏర్పాటు చేస్తే బాగుంటుందని నెల్లూరుకు చెందిన దాతకు దేవస్థానం అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే దేవదాయ శాఖ మంత్రి ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్టు దాత చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం

రూ.1.27 కోట్లు

30 రోజులకు వచ్చిన మొత్తమిది

175.2 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి

అన్నవరం, జూలై 29:

రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, దేవదాయ శాఖ ఉప కమిషనరు రమేష్‌బాబు పర్యవేక్షణలో లెక్కించారు. 30 రోజులకు రూ.1,27,20,345 నగదు, 175.2 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి లభించాయి. యుఎస్ఏ 332 డాలర్లు, కువైట్ 26 దిరహమ్స్, న్యూజిలాండ్ 40 డాలర్లతో పాటు పలు దేశాల కరెన్సీ వచ్చాయి. లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు



▸ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, జూలై 29: జేఎన్టీయూకే పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్, పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూసీఈకే విభాగం గణిత ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్‌ను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన గతంలో అడ్మిషన్స్ డైరెక్టరుగాను, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గాను పనిచేశారు. సివిల్ ప్రొఫెసర్ ఏసురత్నాన్ని ఇన్‌చార్జి డీపఏగాను, యూసీఈకే భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.పద్మజారాణిని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ)గాను బదిలీ చేశారు. ఇప్పటివరకు డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ బి.బాలకృష్ణను ఇన్‌చార్జి డీఏపీగాను, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ స్వర్ణకుమారిని ఎఫ్‌యూఏఆర్ ఇన్‌చార్జి డైరెక్టరుగాను, ప్రొఫెసర్ ఎన్.బాలాజీని లీగల్, ప్రభుత్వ వ్యవహారాల ఇన్‌చార్జి డైరెక్టరుగాను, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్‌ను ఐక్యూఏసీ ఇన్‌చార్జి డైరెక్టరుగాను, కె.పద్మప్రియను ఫార్మసీ కోర్సుల ప్రత్యేకాధికారిగాను నియమించారు. అలూమ్ని రిలేషన్స్ అధికారిగా పనిచేసిన ఎన్.మోహన్‌రావును యూసీఈకే ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ దీక్షితులును గణిత విభాగాధిపతిగా, రసాయన శాస్త్రం విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.సత్యవేణిని భౌతిక శాస్త్రం విభాగాధిపతిగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియామకమైన రవీంద్రనాథ్‌ను, ఇన్‌చార్జి డైరెక్టర్లను ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పిల్లల అక్రమ రవాణా అడ్డగింత

ఆర్పీఎఫ్ పోలీసులకు డీఆర్ఎం ప్రశంసలు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణాను అడ్డుకున్న రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) పోలీసులను రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ప్రశంసించారు. ఈ నెల 27న రాజమహేంద్రవరం-తుని స్టేషన్ల నడుమ ఆర్పీఎఫ్, ఏపీవో బచ్‌పన్ బచావో ఆందోళన్ (ఆంధ్రప్రదేశ్) సిబ్బంది సంయుక్తంగా రైళ్లలో తనిఖీలు చేశారు. ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో 8 మంది బాలలను గుర్తించారు. వారు మరో నలుగురు గుర్తు తెలియని పెద్ద వారితో కలిసి వెళ్తున్నారు. ప్రయాణానికి కారణాలను బాలలు సరిగా వెల్లడించలేకపోవడంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో దింప విచారించారు. విజయవాడ, చెన్నై, తిరుప్పూర్‌తో పాటు కేరళలోని వివిధ ప్రాంతాల్లో బాల కార్మికులుగా పని చేయించుకోడానికి తీసుకెళ్తున్నారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. బాలలను బాలల సంక్షేమ సమితికి అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది. సమయానికి స్పందించి బాలలను కాపాడడంలో చొరవ చూపిన సీనియర్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల, ఆర్పీఎఫ్ రాజమండ్రి పోస్ట్ కమాండర్ సైదయ్య తదితరులను డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సామర్లకోట, జూలై 29: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం కుమ్మరి వీధికి చెందిన పెదపూడి వెంకటరమణ ఒక్కడే తాటాకు పాకలో ఉంటూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి, సోదరులు హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు.



మద్యానికి బానిసైన వెంకటరమణ తన పరిసరాల్లో అందరితోనూ గొడవపడుతూ, దుర్భాషలాడుతూ ఉంటాడు. ఆదివారం రాత్రి కుమ్మరి వీధికి చెందిన కొందరు వ్యక్తులతో వివాదాలకు దిగిన వెంకటరమణను చితక్కొట్టినట్టు సమాచారం. అందుకు సాక్ష్యంగా మృతుడు ధరించిన వస్త్రాలకు బురద అంటుకుని ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రాత్రి వివాదం అనంతరం ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు. సోమవారం ఉదయం ఇరుపక్కల వారు చూసేసరికి వెంకటరమణ చనిపోయి ఉన్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి సామర్లకోట సీఐ సురేష్ తదితర పోలీసులు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేశారు. కాగా గత రాత్రి వెంకటరమణతో వివాదానికి దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద

తగ్గుతున్న వరద ఉధృతి

▸ ధవళేశ్వరం వద్ద 14.40 అడుగులకు చేరిన నీటిమట్టం

▸ 13,92,438 క్యూసెక్కులు సముద్రంలోకి

▸ భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ

ధవళేశ్వరం, జూలై 29: గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం వద్ద 12 గంటల వ్యవధిలో అడుగు మేర తగ్గింది. ఇదే ఒరవడి కొనసాగితే మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చు. ఆదివారం రాత్రి 8గంటలకు 15.80 అడుగుల వరకు నీటిమట్టం పెరిగింది. ఈ సమయంలో అత్యధికంగా 16,09,099 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. 8 గంటల పాటు నిలకడగా కొనసాగి సోమవారం తెల్లవారుజామున తగ్గుముఖం పట్టింది. క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి 7గంటలకు 14.60 అడుగులకు చేరింది. ఎగువున భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ ఆదివారం రాత్రి 10గంటలకు 47.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సోమవారం రాత్రికి నీటిమట్టం 42.8 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

ఎగువున అన్ని ప్రాంతాల్లో నీటిమట్టాలు తగ్గాయి. సోమవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 10.04 మీటర్లు, పేరూరు వద్ద 15.60 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.44 మీటర్లు, భద్రాచలం వద్ద 43 అడుగులు, కూనవరం వద్ద 20.66 మీటర్లు, కుంట వద్ద 12.18 మీటర్లు, పోలవరం వద్ద 13.36 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.99 మీటర్లు నమోదయ్యాయి.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల నిలిపివేత

మోతుగూడెం, జూలై 29: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను సోమవారం నిలిపివేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ బాలకృష్ణ మాట్లాడుతూ గత రెండు రోజులుగా డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో వలసగెడ్డ, పాలగెడ్డ, వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ తగ్గాయన్నారు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో డొంకరాయి నీటిమట్టం 1034.10అడుగులకు తగ్గిందన్నారు. దీంతో అప్పటివరకు నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న 13,124 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లను పూర్తిగా మూసివేసి మరో రెండు గేట్ల ద్వారా 4,258 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగించారు. ఉదయం 11 గంటలకు నీటిమట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా ఉండడంతో మిగతా రెండు గేట్లను కూడా పూర్తిగా మూసివేసి నీటి విడుదలను నిలిపివేశామని ఈఈ తెలిపారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం పవర్ కెనాల్ ద్వారా 3వేల క్యూసెక్కులు డొంకరాయి విద్యుత్ సరఫరా అనంతరం విడుదలవుతుందన్నారు. డొంకరాయి జలాశయంలో 12.398 టీఎంసీల



నీటి నిల్వలు ఉన్నాయని ఈఈ విజయ్‌కుమార్ వివరించారు.





తెల్లవార్లూ తాటిచెట్టుపై ఉన్న నవీన్

నిద్రమత్తులో వరద నీటిలోకి



▸ నిండా మునిగిన టిప్పర్

▸ తెల్లవార్లూ తాటిచెట్టుపైనే డ్రైవర్ నవీన్

▸ ఉదయం గమనించి ఒడ్డుకు చేర్చిన జాలర్లు

చింతూరు, జూలై 29: ఓ టిప్పర్ డ్రైవర్ తెల్లవార్లూ తాటి చెట్టుపై ఉండి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. వివరాలు ఇలా వున్నాయి... తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన డ్రైవర్ మర్రి నవీన్ టిప్పర్‌పై ఆదివారం ఒడిసాలోని జర్సిగూడ బయల్దేరాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వచ్చేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. చింతూరు-కుయుగూరు మధ్య 326వ జాతీయ రహదారిపై వరద నీరు ఉన్న విషయాన్ని నిద్ర మత్తులో గమనించని నవీన్ ముందుకెళ్లాడు. దీంతో టిప్పర్ వరద నీటిలో మునిగింది. నిద్రమత్తు వీడిన అతడు టిప్పర్ క్యాబిన్ నుంచి కష్టంమీద బయటకొచ్చి ఈదుకుంటూ దగ్గర్లో ఉన్న తాటిచెట్టు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఎటు వెళ్తే ఒడ్డుకు చేరతాడో అర్థం కాక తెల్లవార్లూ తాటిచెట్టుపైనే ఉన్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో వరద విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన జాలర్లను చూసి నవీన్ కాపాడండి అంటూ కేకలు వేశాడు. దీనిని గమనించిన జాలర్లు వచ్చి అతడిని బోటులో ఒడ్డుకు చేర్చారు.

వరద సాయాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలి

ప్రతీ బాధిత కుటుంబానికీ రూ.3వేలు అందించాలి

టెలి కాన్ఫరెన్స్‌లో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు జూలై 29: గోదావరి వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే రూ.3వేల సాయాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాల వారికి సాయం అందాలని ఆదేశించారు. సాయం అందలేదని ఫిర్యాదు రాకూడదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధు లు, గ్రామ స్థాయి కమిటీ సభ్యుల సమక్షంలో నగదు పంపిణీ జరగాలన్నారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. తొలుత కూనవరం, వీఆర్ పురం మండలాల్లో, తర్వాత ఎటపాక, చింతూరు మండలాల్లో వరద బాధితులకు సాయం పంపిణీ చేయాలని ఆదేశించారు.





చోరీ ఘటనను వివరిస్తున్న సీఐ శేఖర్‌బాబు, చోరీకి గురైన వస్తువులను మీడియాకు చూపిస్తున్న దృశ్యం

కుటుంబ సభ్యుడే సూత్రధారి

చెడు వ్యవసనాలకు బానిసై నగదు, నగలు అపహరణ

ప్రత్తిపాడులో వైద్యఉద్యోగి ఇంట్లో చోరీ ఘటనలో బీటెక్ విద్యార్థితో పాటు మరో నలుగురు అరెస్టు

పదహారున్నర కాసులు బంగారం, రూ.2.50లక్షల నగదు రికవరీ

ప్రత్తిపాడు, జూలై 29: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వైద్య ఉద్యోగి ఇంట్లో జరిగిన చోరీ ఘటనలో కుటుంబ సభ్యుడే సూత్రధారి అయి నగదు, నగలు అపహరణలో కీలకమయ్యాడు. ఈ ఘటనలో పదహారున్నర కాసుల బంగారం, రూ.2.50 లక్షల నగదు స్వాధీనపరుచుకుని ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం సీఐ ఎం.శేఖర్‌బాబు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసముం టున్న వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి ఇంట్లో ఈ నెల 25వ తేదీన చోరీ జరిగింది. ఇరవైరెండున్నర కాసుల బంగారం, రూ.3లక్షల నగదు అపహరణకు గురైనట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రధాన సూత్రధారిగా వైద్య ఉద్యోగి అన్న కొడుకు మచ్చికర్ల సాయిచరణ్‌ను పోలీసులు గుర్తించారు. వ్యవసాలకు బానిసైన అతడు ఈ చోరీకి మాస్టర్ ప్లాన్ వేశాడు. అతనికి స్నేహితులు అనుగుల అజయ్, వలసాని ధనుష్, సత్యసాయి, బన్ని సహకరించారు. సాయికిరణ్ తరుచూ ఇంటికి వచ్చి తాళాలు భద్రపరిచే చోటును గమనించి స్నేహితుల సహాయంతో ఇంట్లోకి చొరబడి నగదు, నగలు అపహరించుకుపోయాడు. వీటిని కాకినాడలో సాయి చరణ్ స్నేహితుడు బన్ని వద్ద భద్రపరిచారు. నిందితులను విచారించగా దొంగతనానికి పాల్పడినట్టు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల నగదు, పదహారు కాసులు బంగారం స్వాధీనం చేసుకుని సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్ బాబు కోరారు. యువత సన్మార్గంలో నడిచేందుకు తల్లిదండ్రుల అజమాయిషీ కూడా ఉండాలన్నారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో దొంగతనాల నివారణకు రాత్రి పూట గస్తీని ముమ్మరం చేశామని చెప్పారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఐదు గురిలో ముగ్గురు యువకులను సోమవారం అరెస్టు చేసినట్టు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... ఏజెన్సీలోని రంపచోడవరం ప్రాంతానికి చెందిన పండు (టామ్) గంజాయిని తీసుకొచ్చి నగరంలోని వీరభద్రా నగర్‌కి చెందిన జలగడుగుల నరేంద్రకు రంపచోడవరంలో విక్రయిస్తాడు. అతడి వద్ద నుంచి తాడితోట రెల్లివీధికి చెందిన ధనాల భవానీశంకర్, షెల్టాన్ హోటల్ సమీపంలోని వీరభద్రాపురానికి చెందిన బాదంపూడి శ్యాం దుర్గాప్రసాద్, గోరక్షణపేటకు చెందిన రొడ్డా రాకేశ్ కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలో గోదావరి గట్టున ఉమామార్కండేయ స్వామి గుడి సమీపంలోని పిండాల రేవులో గంజాయి కలిగి ఉండడంతో పాటు విక్రయాలు జరుపుతున్న నరేంద్ర, భవానీశంకర్, దుర్గాప్రసాద్‌లను వన్‌టౌన్ ఎస్ఐ ఎం.కేశవరావు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పండు, రాకేశ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలిస్తున్నారు. గంజాయి వాడకం, విక్రయం, నిల్వ, రవాణాపై ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ చెప్పారు. గంజాయి బ్యాచ్‌ను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కేశవరావు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు.

గంజాయితో బాలుడి అరెస్టు

తుని రూరల్, జూలై 29: తుని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయితో ఓ బాలుడు పట్టుబడినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన ఆ బాలుడు రైలు మార్గాన తుని చేరుకుని అక్కడి నుంచి నర్సీపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేశాడన్నారు. 4.900 కిలోల గంజాయితో తుని చేరుకుని రైలు ఎక్కే క్రమంలో పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా గంజాయి తరలింపులో సూత్రధారులుగా ఉన్న మరో ఇద్దరు పేర్లు వెల్లడించాడు. వారిద్దరూ అనంతపురానికి చెందిన వారే అని, పట్టుకునేందుకు ఒక బృందం అక్కడకు వెళ్లారని సీఐ చెప్పారు.



మంగ మృతదేహం

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

జగ్గంపేట, జూలై 29:

కాకినాడ జిల్లా జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన కింతాడ మంగ (40) విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆమె తన ఇంటి వద్ద నీళ్లు పట్టేందుకు మోటారు వైర్లను ప్లగ్‌లో పెడుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో కుప్పకూలి మృతి చెందినట్టు ఆమె భర్త తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దమ్మాయికి పెళ్లికాగా రెండో అమ్మాయికి పెళ్లి కావాల్సి ఉంది. ఈ ఘటనపై జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చట్టి గ్రామంలో తలదాచుకునేందుకు వరద బాధితులు వేసుకున్న గుడారాలు

ఇంకా వరద నీటిలోనే

అంధకారంలో 76 ఆవాసాలు

49 రహదారులు మూసివేత

కొనసాగుతున్న సహాయక చర్యలు

చింతూరు, జూలై 29: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని లోతట్టు గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. సోమవారం భద్రాచలం వద్ద గోదావరి 43.20 అడుగుల మేర ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. వరద ఉధృతి తగ్గుతున్నా గ్రామాలు, రహదారులు ముంపులోనే ఉన్నాయి. చట్టి గ్రామంలో వరద బాధితులు తాత్కాలికంగా ఉండేందుకు గుడారాలు వేసుకున్నారు. డివిజన్ పరిధిలోని 121 ఆవాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా సోమవారం సాయంత్రం 45 ఆవాసాలకు పునరుద్ధరించారు. మిగిలిన 76 ఆవాసాలు అంధకారంలో మగ్గుతున్నాయి. వరద నీటిలో వున్న 49 ప్రధాన రహదారులపై రాకపోకలను నిలిపివేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో వరద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

శెభాష్ సత్తిబాబు



▸ వాగు దాటి విధులు నిర్వర్తించిన లైన్‌మన్

▸ అభినందించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

రౌతులపూడి, జూలై 29: కాకినాడ జిల్లా జగ్గంపేట డివిజన్ రౌతులపూడి సెక్షన్ గుమ్మరేగుల పరిధిలోని కొట్టాం 11 కేవీ ఫీడర్ కొద్ది రోజులుగా తరచూ బ్రేక్‌డౌన్ అవుతోంది. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలపై పడడంతో అస్తమానం సరఫరా నిలిచిపోతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కూడా ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి బ్రేక్‌డౌన్ అయ్యింది. ఇటీవలి భారీ వర్షాలకు గుమ్మరేగుల ఏటికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కాలువ దాటి వెళ్తే తప్ప విద్యుత్ సమస్య పరిష్కారం కాదు. లైన్‌మన్ కారం సత్తిబాబు నడుముకు తాడు కట్టుకుని వైర్లపైపడిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారింది. దానిని చూసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన లైన్‌మన్ సత్తిబాబును ప్రశంసించారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా
•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

● ఇంకా లంకల్లో పడవలపై ప్రయాణం
● వరద నీటిలోనే వాణిజ్య పంటలు
● అధికారులు, నాయకుల పర్యటన

9281 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

పి.గన్నవరం, జూలై 29: కొత్తపేట డివిజన్‌లో పి.గన్నవరం మండలంలో 4077, అయినవిల్లిలో 4795, కొత్తపేటలో 227, రావులపాలెంలో 110, ఆత్రేయపురంలో 18, అంబాజీపేటలో 54 వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్లు ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ చెప్పారు. మండలంలోని కె.ఏనుగుపల్లి, లంకలగన్నవరం తదితర లంక గ్రామాల్లో ఆయన పర్యటించి అనంతరం మాట్లాడారు. పి.గన్నవరం మండలానికి 31మెట్రిక్ టన్నులు పశువుల దాణా వస్తుందని తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ భవనం ప్రారంభం

పి.గన్నవరం, జూలై 29: పి.గన్నవరంలో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ యూనియన్ సభ్యులు రాష్ట్రంలో మొట్టమొదటిగా నూతన భవనాన్ని నిర్మించారు. ఈభవనాన్ని ఏపీ పీవీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వీరేంద్ర ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశానికి కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి యూనియన్ సొంత భవనం మీదేనని సభ్యులను అభినందించారు. భవవ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించిన రాజమహేంద్రవరానికి చెందిన ఫ్రింటోనిక్ కలర్‌లాబ్ అధినేత సత్యవరపు గోకుల మురళీకు అభినందనలు తెలిపారు. తొలుత అక్విడెక్టు వద్ద ఉన్న కెమేరా సృష్టకర్త లూయిస్‌డాగూరే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చక్కా రాంబాబు, ఎస్‌కే కోజాబాబు, సీవీ రావు, పడాల రామిరెడ్డి, కొక్కిరి కిరణ్, కడలి శ్రీనివాసరావు, మెల్లం వెంకన్న, తోట రామకృష్ణ, గూటం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 29: ఆపదలో ఉన్న పలువురికి మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. కాపవరానికి చెందిన సిద్దాల తరుణ్‌కుమార్ ఇటీవల ట్రాక్టరు ప్రమాదంలో మృతి చెందాడు. ఆకుటుంబాన్ని మంత్రి పరామర్శించి రూ.10వేలు అందించారు. చల్లా భీమశంకర్‌కు పుట్టుకతో కాళ్లు వంకరగా ఉన్నాయి. ఇటీవల అతడి రెండు కాళ్లకు సర్జరీ చేశారు. అతడిని పరామర్శించి మంత్రి రూ.10వేలు అందించారు. ఆదివారపుపేటకు చెందిన అల్లక కృష్ణంరాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతడికి మంత్రి రూ.20వేలు అందించారు

వెంటాడుతున్న వరద కష్టాలు


మామిడికుదురు మండలం బి.దొడ్డవరం గ్రామంలో ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు


ఆత్రేయపురం: పిచ్చుకలంకలోని వరదలో ఇళ్లు మునిగిన దృశ్యం,


అయినవిల్లి: పొట్టిలంక వద్ద రహదారిపై వరద నీరు


ఆలమూరు: బడుగువానిలంకలో ముంపునకు గురైన వాణిజ్యపంటలు

మామిడికుదురు, జూలై 29: భద్రాచలం, ధవళేశ్వరంలో వరద నీటిమట్టం తగ్గుతూ ఉండడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వారం రోజులుగా అప్పనపల్లి, దొడ్డవరం, పాశర్లపూడిలోని శ్రీరామపేట, పల్లవపాలెం, పెదపట్నంలోని అరుంధతిపేట, రత్నాపురం గ్రామాలు వరద నీటిలో మునిగి తేలుతున్నాయి. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పదపట్నంలంక గ్రామాల నుంచి బాహ్య ప్రపంచానికి రావాలంటే ఉచ్చులవారి పేట నుంచి ట్రాక్టరుపై రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడి శ్రీరామపేటలోని ఇళ్ల చుట్టూ వరద నీరు చేరడంతో స్థానికులు పడవలపై ప్రయాణాలు చేస్తున్నారు. వరద తగ్గినా వదర మిగిల్చిన కష్టాలు బయటపడతాయని లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పాశర్లపూడిలోని శ్రీరామపేట, పల్లవపాలెం, సత్రంతోట తదితర ప్రాంతాల్లో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పర్యటించి బాధితుల కష్టాలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

జల దిగ్బంధంలో లంక గ్రామాలు

అయినవిల్లి, జూలై 29: గోదావరి వరద ప్రభావంతో లంక గ్రామాలు ఇంకా జల దిగ్బంధంలో ఉన్నాయి. గౌతమీ, వశిష్ఠ నదులు పొంగి ప్రవహిస్తుండడంతో గోదావరికి వరద పోటెత్తింది. వరద ముంపు ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆకు, కూరగాయల పంటలు పాడైపోయాయి. పశుగ్రాసం దొరక్క పశువులు అల్లాడిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముంపు గ్రామాల్లో వరద బాధితులకు నిత్యవసరాలు, కూరగాయలు, బియ్యం, తాగునీరు వంటి వాటిని పంపిణీ చేస్తున్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

ఆత్రేయపురం, జూలై 29: వరద తగ్గుముఖం పట్టింది. పిచ్చుకలంకలోని 20ఇళ్లు వరదలో మునిగిపోయాయి. వారంతా సురక్షిత ప్రాంతంలో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. తహసీల్దారు వెంకట్రామయ్య ఆదేశాల మేరకు నిర్వాసితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. వరదలకు పంటలు కొట్టుకుపోయాయి. పిచ్చుకలంకలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. వర్షాలు, వరదల కారణంగా పాడి రైతులకు గడ్డికొరత ఏర్పడింది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నారాయణలంకలో ఆర్డీవో పర్యటన

కపిలేశ్వరపురం, జూలై 29: వరద ఉధృతి తగ్గినప్పటికి గోదావరి నదీ ప్రవాహం కొనసాగుతుంది. నారాయణలంకలో రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ సోమవారం పర్యటించారు. గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి మందులను తనిఖీ చేశారు. నారాయణ లంక కాజ్వే పైనుంచి పొంగిపొర్లుతున్న వరదనీటిని, గ్రామ పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఏవో రమేష్‌కుమార్, వీఆర్‌వోలు వెంకటేశ్వరరావు, ప్రసాద్, వీఆర్ఏలు ప్రకాష్, పోలీస్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

120ఎకరాల్లో వాణిజ్య పంటలకు నష్టం

ఆలమూరు, జూలై 29: మండలంలోని లంక గ్రామాల్లో వరద ముంపుతో 120ఎకరాల్లో వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించామని నియోజకవర్గ ఉద్యానవన అధికారి కోటేశ్వరరావు తెలిపారు.వరదలు తగ్గిన తర్వాత పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలనచేసి నష్టాన్ని గుర్తిస్తామన్నారు. ప్రాథమిక అంచనాల కంటే అధికంగా పంట నష్టాలు ఉండవచ్చని రైతులు చెబుతున్నారు.

ముంపు బాధితులకు సాయం పంపిణీ


అమలాపురం: ఇందుపల్లిలో ముంపు బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



కొత్తపేట: నారాయణలంక వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు తనయుడు బండారు సంజీవ్,
మామిడికుదురు: పాశర్లపూడిలంక శ్రీరామపేటలో వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


కపిలేశ్వరపురం: అద్దంకివారిలంకలో నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు

అమలాపురం రూరల్, జూలై 29: గోదావరి వరదలతో మండల పరిధిలోని అప్పర్ కౌశిక, లోయర్ కౌశిక మేజర్ డ్రెయిన్లతో పాటు కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఇందుపల్లి, ఈదరపల్లి, బండారులంకలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సోమవారం ఇందుపల్లిలో వరద ముంపు బారిన పడ్డ కుటుంబాలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అధికారి బాబ్జి, చొల్లంగి అప్పాజీ, మల్లుల పోలయ్య, మల్లుల రామకృష్ణ, బండి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

కొత్తపేట, జూలై29: కొత్తపేటశివారు నారాయణలంక, సత్తెమ్మలంక వరద బాధిత ప్రాంతాలలో సోమవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా బాధితులతో మాట్లాడిన అనంతరం మెడికల్ క్యాంపులను సందర్శించి వరద బాధితులకు తగిన సాయం అందించాలని కోరారు. అనంతరం ముంపు బాధితులకు 20కేజీల బియ్యాన్ని తక్షణ సాయం కింద అందించారు. అధికారులు నిత్యం బాధితులకు అందుబాటులో ఉండాలని సూచించారు. వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, గనిశెట్టి వీరేష్, తహసీల్దారు జి.ఏలీషా, ఆర్ఐ ఏడుకొండలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాధితులందరికీ వరద సాయం అందిస్తా

మామిడికుదురు, జూలై 29: వదర బాధిత కుటుంబాలన్నింటికీ ప్రభుత్వం అందించే సాయాన్ని పంపిణీ చేస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడిలంక శ్రీరామపేటలో వరద బాధితులకు నిత్యావసరాలు ఎమ్మెల్యే సోమవారం అందించారు. పడవపై నాయకులతో కలసి కాలనీల్లోకి వెళ్లి బాధితుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డులేని బాధితులకు ప్రభుత్వ సాయం అందడంలేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందరికీ బియ్యం, నిత్యావసరాలు అందేలా చూడాలని తహసీల్దార్ మేరికమ్మకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు

కపిలేశ్వరపురం, జూలై 29: వరదల పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని, కూటమి ప్రభుత్వం బాధితులను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సోమవారం కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని వరద బాధితులకు ఎమ్మెల్యే ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ ఆయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు చొప్పున నిత్యావసరాలు పంపిణీ చేసారు. కేదార్లంక, అద్దంకివారిలంక, కాలేరు గ్రామాల సర్పంచ్‌లు వీధివెంకటరెడ్డి, నాతి గవరయ్య, దాయం కావేరి శేఖర్‌బాబు, తహసీల్దార్ రాజరాజేశ్వరి, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో శుభదిన్ భోజన్

ద్రాక్షారామ, జూలై 29: కాపవరం జడ్పీ హెచ్‌ఎస్‌లో సోమవారం శుభదిన్ భోజన్ కార్యక్రమం జరిగింది. ఏపీ పాఠశాలల్లో ఈనెల22 నుంచి 29వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో ఈకార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ యనమదల మంగాదేవి శ్రీనివాస్, ఎంపీటీసీ రెడ్డం సతీష్, హెచ్‌ఎం ముమ్మిడి సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టరు చిలుకూరి విశ్వేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ మత్తి లక్ష్మీమణిమాల, టీడీపీ నాయకులు వాసంశెట్టి శేషగిరి, నల్లం రాంబాబు, చల్ల చంద్రశేఖర్, పోతురాజు నరేష్, వినకోటి శ్రీనివాస్, పలివెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అల్లూరుకి నివాళులు

అంతర్వేది, జూలై 29: సఖినేటిపల్లిలో మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు, కేఎస్‌ఎన్ రాజు, చంటిరాజు నివాళులర్పించారు.

కంకిపాటి సోదరులకు ఎమ్మెల్యే పరామర్శ



అల్లవరం, జూలై29: అల్లవరంలో కంకిపాటి నారాయణమ్మ మృతితో బాధపడుతున్న జనసేన నాయకులు కంకిపాటి పెదబుజ్జి, వీరబాబు సోదరులను సోమవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ ప్రముఖులు దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, బొర్రా ఈశ్వరరావు, చికిలే చిట్టిబాబు, లూటుకుర్తి చిన్న, పచ్చిమాల ఏడుకొండలు, కేవీ.బి.చిట్టివెంకన్న, రాసూరి రాంబాబు, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల కమిటీ కన్వీనర్‌గా నరహరశెట్టి

అంతర్వేది, జూలై29: ఎస్టీయూ రాష్ట్ర శిక్షణా తరగతుల కమిటీ కన్వీనర్‌గా గొంది జడ్పీఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం నరహరశెట్టి సత్యనారాయణ నియమితులయ్యారు. సంఘజిల్లా నాయకుడు, మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఉండపల్లి గిరిబాబు, ఆర్థిక కార్యదర్శి జీవీవీ కృష్ణప్రసాద్ ఆయన్ను అభినందించారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం


గోపాయిలంక స్లూయిస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, జూలై 29: గత ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే గోపాయిలంక స్లూయిస్ తలుపులుఊడి డ్రెయిన్ మీదుగా వరద నీరు పోటెత్తిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ధ్వజమెత్తారు. గోపాయిలంక అవుట్‌పాల్ స్లూయిస్ తలుపులు ఊడిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. స్లూయిస్ పనిచేయక కుమ్మరి కాలువ డ్రెయిన్ వరద ముంపునకు గురైనందున దీనిపై సీఎంచంద్రబాబుకు, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. తలుపులు ఊడి వరద పోటెత్తితే ఇరిగేషన్ హెడ్‌వర్క్స్, డ్రెయిన్ అధికారులు ఎందుకప్రతిపాదన చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన స్లూయిస్ తలుపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహసీల్దారు పి.సునీల్‌కుమార్, డ్రెయిన్స్ ఏఈ కె.సునీత, టీడీపీ మండలఅధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, వేగిరాజు వెంకట్రాజు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ప్రారంభం

కపిలేశ్వరపురం, జూలై 29: కపిలేశ్వరపురం, తాతపూడి స్టాక్‌పాయింట్ల నుంచి ఈనెల8న ప్రారంభమైన ఉచిత ఇసుక తరలింపు జట్టు కూలీలకు నగదు చెల్లించకపోవడంతో 11న నిలిచిపోయింది. సోమవారం నుంచి ఉచిత ఇసుక తరలింపు ప్రారంభమైంది. కపిలేశ్వరపురంలో రోజుకు 32మంది చొప్పున 2జట్లు మొత్తం 64మంది, తాతపూడిలో 14మంది జట్టు కూలీలు పనిచేస్తున్నట్లు తహసీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు.

ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు జమచేయాలి


కమిషనర్ కృష్ణతేజను సత్కరించిన జిల్లా సర్పంచ్‌ల సంఘ ప్రతినిధులు

అమలాపురం రూరల్, జూలై 29: వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించిందని, ఆ నిధులను తిరిగి పంచాయతీలకు జమచేసి ఆర్థిక పరిపుష్టి కల్పించాలని కోరుతూ జిల్లా సర్పంచ్‌ల సంఘ ప్రతినిధుల బృందం సోమవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ నూతన కమిషనర్ వీఆర్ కృష్ణతేజకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య కార్యవర్గ సభ్యురాలు పెనుమాల సునీత ఆధ్వర్యంలో సర్పంచ్‌ల బృందం తాడేపల్లిలో కృష్ణతేజను కలిసి తొలుత అభినందించి సత్కరించారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు సకాలంలో పంచాయతీలకు జమచేయాలని, సర్పంచ్‌ల హక్కులు, విధులను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సూర్యప్రకాష్, బీరం జానకీదేవి, ఎన్.లలితకుమార్, పూల నాగమణి, పెనుమాల ఏడుకొండలు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ సాయం

మామిడికుదురు, జూలై 29: కొమరాడకు చెందిన పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, అతని కుమారుడు త్రినాథ్‌శివప్రసాద్ మృతిచెందగా కార్మిక శాకా మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం వెంకటేశ్వరరావు సతీమణి భారతికి రూ.లక్ష అందించారు. ఇల్లు, ఇతర పథకాలు వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతడికి రూ.20వేలు మంత్రి అందించారు.

ధాన్యం బకాయిల కోసం రైతుల నిరసన

అమలాపురం టౌన్, జూలై 29: రైతు భరోసా కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించి మూడు నెలలు గడిచిపోయినా ఇంత వరకు రబీ ధాన్యం బకాయిలు విడుదల కాకపోవడంతో రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అయినవిల్లి, ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం మండలాలకు చెందిన రైతులు ధాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కోడ్ అమలులోకి రావడంతో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ఇంతవరకు సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమకాలేదని ఇప్పటికే పలు పర్యాయాలు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తొలకరి పంట పెట్టుబడుల సొమ్ములు లేవని, అప్పు పుట్టడం లేదన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో కొలిశెట్టి త్రిమూర్తులు, వాకపల్లి శ్రీను, గుండుమోగుల చిట్టిబాబు, వాసంశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి తేజ, కొలిశెట్టి రామచంద్రరావు పాల్గొన్నారు.

స్థానికులకు ఇసుక అందుబాటులో ఉంచాలి

రావులపాలెం, జూలై 29: జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధికారులు ఇచ్చిన విధివిధానాల ప్రకారం ఇసుకను అందుబాటులో ఉంచాలని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాడు వద్ద ఉన్న ఇసుక పాయింట్ వద్దకు ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం వచ్చారు. ఈసందర్భంగా స్టాక్ పాయింట్ వద్ద ఉన్నఅధికారులతో సీరియల్ ప్రకారంలారీలు ఎందుకు లోడ్ చేయడంలేదు, స్థానిక లారీలకుఎందుకు ఎగుమతి చేయడంలేదు, అదనంగా ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. విలేకరులతో మాట్లాడుతూ వరదల సమయంలో స్టాక్ పాయింట్లలో ఇసుకను ఉచితంగా అందిస్తామని చెబుతూ అధికధరకు వసూలుచేయడం ఏమిటనిప్రశ్నించారు.

విద్యార్థులకు పసందైన విందు భోజనం

ఆత్రేయపురం, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు పసందైన విందు ఏర్పాటు చేశారు. వాసంశెట్టివారి పాలెంలో విద్యార్థులకు హెచ్‌ఎం మాణిక్యాలరావు ఆధ్వర్యంలో పెన్నులు, చాక్లెట్లు, స్వీట్లను ఎంఈవో సాహెబ్ అందజేశారు. అలాగే లొల్ల జడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ కాయల జగన్నాథం మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మెర్లపాలెం, తాడిపూడి, ర్యాలి గ్రామాల్లోని పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతపై హెచ్‌ఎం శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి విద్యార్థులకు హోమియో మందులనుఉచితంగా అందించారు.

దేవస్థానం కౌలు రైతులకు కార్డులు అందించాలి

రాయవరం, జూలై 29: దేవస్థానం భూములు కౌలుకు తీసుకున్న రైతులకు కౌలుకార్డులు అందజేయాలని బీజేపీ నాయకులు సోమవారం తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేవస్థానం భూములు కౌలు చేస్తున్న రైతులకు కౌలుకార్డుల మంజూరు ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చాట్రాతి జానకి రాంబాబు, శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, ఈరెళ్ల కృష్ణమూర్తి, గుత్తుల వెంకటరమణ, ఎ.జనార్ధనాచార్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

మండపేట, జూలై 29: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, జొన్నపల్లి సూర్యారావు, ఎంఈవో నాయుడు రామచం ద్రరావు, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.


పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, జూలై 29: 22వ వార్డుకు చెందిన చెల్లో చిన్న, 25వ వార్డుకు చెందిన కాళ్ల అప్పారావు ఇటీవల మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆయా కుటుంబసభ్యులు ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వాదా ప్రసాదరావు, జొన్నపల్లి సూర్యారావు, బొత్స నరసింహమూర్తి, షేక్ వల్లి జానీ తదితరులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 17 ఫిర్యాదులు

అమలాపురంటౌన్, జూలై29: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్)లో 17అర్జీలు స్వీకరించినట్లు అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా తెలిపారు. ఫిర్యాదులను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. సివిల్ వివాదాలు2, కుటుంబకలహాలపై4, ఇతర సమస్యలపై11అర్జీలు వచ్చాయన్నారు.

వరదలో సహాయం



పి.గన్నవరం, జూలై 29: ఉడిమూడిలంకకు చెందిన పిట్టా నారాయుడు ఏడాదిగా అనారోగ్యంతో బాధపడు తున్నాడు. సోమవారం ఆరోగ్యం బాగా క్షీణించింది. బంధువులు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం వరద నీటిలో వచ్చి నారాయుడిని బెల్లంపూడికి తీసుకు వచ్చి 108లో ఆసుపత్రికి తరలించారు.

ఆషాఢంలో ఆరోగ్య రహస్యాలు ఎన్నో

అమలాపురం టౌన్, జూలై 29: ఆషాఢ మాసంలో ఆరోగ్య రహస్యాల ప్రాముఖ్యాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి వివరించారు. ఆషాఢమాసం ఆచారాల్లో దాగి ఉన్న ఆరోగ్య సూత్రాలను తెలిపారు. తెలగపిండి, మునగాకు, నేరుడుపండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు, గోరింటాకు పెట్టుకోవడంలో అంతరార్థాన్ని వివరించారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలికలకు ప్రత్యేకంగా ఆషాఢమాసం ఆచారాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదనరావు, ఉపవిద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షా సప్తాహ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డీఈవో కార్యాలయ సిబ్బంది విద్యార్థులకు పండ్లు, కౌన్సిలర్ సంసాని చంద్రశేఖర్ స్వీట్లు సమకూర్చగా 550 మందికి పంపిణీ చేశారు. ఏఎంవో రాంబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిల్ పరిశీలన

అమలాపురం రూరల్, జూలై 29: నల్లమిల్లిలో ఐదున్నరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవనాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం పరిశీలించారు. రూ.కోటితో నిర్మించిన స్టడీ సర్కిల్ భవనాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందని కలెక్టర్‌కు వివరించారు. సర్పంచ్ గోకరకొండ వాసు ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ భవనం తాళాలను తెరిచి లోపల పరిశీలించారు.ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ శాఖాధికారులను ఆదేశించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఆపరేషన్ రావణ
శ్రీలలిత	: పురుషోత్తముడు
శేఖర్ స్క్రీన్-1	: డార్లింగ్
శేఖర్ స్క్రీన్-2	: డెడ్ పూల్
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డెడ్ పూల్

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మను కలిసిన బండారు



కొత్తపేట, జూలై 29: తమ ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పేందుకు మానవ వనరులు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని, ఈప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిసిన బండారు పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈసందర్భంగా బండారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేక యువత వివిధ రాష్ట్రాలకు వలస వెళుతోందని ఈప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మంత్రి శ్రీనివాసవర్మ స్పందిస్తూ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ముమ్మిడివరం, జూలై 29: స్థానిక 9వవార్డు సోమిదేవరపాలెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాట్ల పృథ్విరాజ్, కౌన్సిలర్లు అడబాల సతీష్‌కుమార్, ములపర్తి బాలకృష్ణ కిట్లు అందజేశారు. చినకొత్తలంకలో ప్రాథమిక పాఠశాలలో టీడీపీ జిల్లా కార్యదర్శి పొత్తూరి విజయభాస్కరవర్మ ఆధ్వర్యంలో కిట్లు అందించారు. పచ్చమట్ల సీతారామరాజు, పెద్దిరెడ్డి కృష్ణమూర్తి, కముజు సుబ్రహ్మణ్యం, సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్ అరుణకుమారి, కడలి నాగు, కట్టా సత్తిబాబు, దివి విజయ్, మాదాల కుమార్, నడింపల్లి శ్రీనివాసరాజు, హెచ్‌ఎంలు శిరీష, కోలాస్వాతి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మలికిపురం, జూలై 29: మలికిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డులో కొబ్బరి చెట్టు పడిపోవడం వల్ల ఇన్‌కమింగ్ డబుల్ సర్క్యూట్ ఫీడర్స్ 2, 3 డబుల్ సర్క్యూట్ పోల్స్ విరిగిపోయి ఆదివారం రాత్రి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈసెంటర్‌లో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. మలికిపురంలో ఎం.సతీష్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

టీడీపీ ఏడిద గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పర్వతిన

మండపేట, జూలై 29: టీడీపీ ఏడిద గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా సీనియర్ టీడీపీ నేత పర్వతిన వీర్రాజు ఎన్నికయ్యారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన స్థానిక టీడీపీ నేతలు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

జనసేన సాయం

అంబాజీపేట, జూలై 29: నందంపూడిలో వరదబాధితులకు జనసేన పార్టీ నాయకులు ఆహార పొట్లాలను అం దించారు. బొంతువారిపేట, రజకపేటల్లో సోమవారం జనసేన నేతలు పర్యటించారు. జనసేన నాయకులు సుంకర బాలాజీ, అరిగెల సూరిబాబు, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాణింగపల్లి పాఠశాలలో శుభదిన్ భోజన్

కె.గంగవరం, జూలై 29: ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో పాణింగపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. కొడవటి వీవీఎస్ వరప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులకు శుభదిన్ భోజన్ మెనూ ప్రకారం భోజనం అందజేశారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి చేయూత

పి.గన్నవరం, జూలై 29: లంకలగన్నవరం శివారు డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కొల్లు రవీంద్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. స్థానిక హైస్కూలు విద్యార్థులు సేకరించిన రూ.34వేలు, ఉపాధ్యాయులు అందించిన రూ.4వేలు సోమవారం మొత్తం రూ.38వేలు విద్యార్థులు రవీంద్రకు అందించారు. అలాగే స్థానిక లక్ష్మీఐటీఐ విద్యార్థులు రూ.3,200 రవీంద్రకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం జి.రామకృష్ణారావు, స్థానికులు పాల్గొన్నారు.

కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

మలికిపురం, జూలై 29: టేకిశెట్టిపాలెం ఎత్తు వంతెన వద్ద మలికిపురం కాల్వలో పడి సఖినేటిపల్లికి చెందిన చీర్ల దుర్గారావు(36)గల్లంతయ్యాడు. తోడల్లుడు గునిశెట్టి శ్రీనుతో కలిసి అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్న గన్నవరం కాల్వరేవులో కాళ్లు కడుక్కునేందుకు దిగగా దుర్గారావు గల్లంతయ్యాడు.

వరద బాధితులకు కూరగాయలు పంపిణీ

అంతర్వేది, జూలై 29: అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం, లాకోపేట, సఖినేటిపల్లిలంక వరద ముంపు బాధితులకు మహిళా మండలి సమాఖ్య ఏపీఎం కె.విజయ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పడవలపై వెళ్లి కూరగాయల ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. అలాగే భోజనం, తాగునీరు, నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేసినట్లు తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌లు తెలిపారు. ఏపీవో నాగప్రసాద్, ఏవో నరసింహారావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు

రాజోలు, జూలై 29: విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడని రాష్ట్ర హార్టీకల్చర్ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు అన్నారు. తాటిపాకలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు మాత్రమే గట్టెక్కించగలరని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు, వెనుకబడిన జిల్లాలకు నిధులు, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఇదంతా చంద్రబాబు వల్లే సాధ్యమైందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

ఉప్పలగుప్తం, జూలై 29: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో దోహదపడుతుందని ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ అన్నారు. వల్లాయిచెరువు ప్రాథమిక పాఠశాలలో సోమవారం తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు.విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. దాతలఆధ్వర్యంలో విద్యార్థులకు విందుఏర్పాటుచేశారు. ఎంపీటీసీ నిమ్మకాయల రాము, హెచ్‌ఎం ఎన్టీపీఎస్ నాగేశ్వరరావు, నూకల సుబ్బారావు, స్థానికపెద్దలు పాల్గొన్నారు.